


'సుశీ! అర్నెల్ల క్రితంవరకూ నీ జీవితం నా యిష్టమొచ్చినట్లు నడిచింది! ఇప్పుడూ నీవు నా చెప్పుచేతల్లో వుండాలని భావించటం నా మూర్ఖత్వమే! ఐనా, నీ శ్రేయస్సు కోరేదాన్నిగా, నిన్ను నిర్దేశించటానికి సాహసిస్తున్నాను. అక్కడికి వెళ్ళగానే పిచ్చి ఆలోచన్లు చేయక వెంటనే బావకు ఉత్తరం రాయి. నీ ఉత్తరం చూసుకుని బావ సంతోషపడాలి! బావ సంతోషమే నా సంతోషం...'

ఆకాశాన్ని మబ్బులు అల్లుకుంటున్నాయి. చలిగాలి ప్రారంభమైంది! ప్లాట్‌ఫారంమీద జనం వెయిటింగ్‌హాల్లోకి సర్దుకుంటున్నారు. ఐదు నిమిషాలు నిశ్చింతగా నిల్చున్న రైలు గార్డు విజిల్ వినగానే ఉలిక్కిపడ్డట్టు కూతేసి సంచలనం రేపింది. జనం రైలు పెట్టెల దగ్గరికి పరుగెత్తుకొచ్చారు. రెండో కూతేసి నత్త నడక సాగించింది రైలు. చేతనైనమేరకు జనంకూడ పెట్టెల ననుసరించారు. క్రమంగా బండి వేగాన్ని పుంజుకోవటం, టప టపమని చినుకులు రాలటం ఒకేసారి జరిగింది!

ఆడవాళ్ళ పెట్టెలో కిటికీ దగ్గర కూర్చుంది సుశీల. ఇంటి దగ్గర బయల్దేరేటప్పుడు అక్కయ్య చెప్పిన మాటలు మనసును కెలుకుతున్నాయి. ఎంత జాణతనం ప్రదర్శించింది! బావ సంతోషంకోసం తన్నా విధంగా నిర్దేశించవలసి వచ్చిందట! చివరకు స్టేషన్‌కుకూడ రాలేదు సాగనంపటానికి! అంత అపరాధం తనేం జేసింది? నిజమే! అర్నెల్ల క్రితం వరకూ తన జీవితం అక్కయ్యా బావల ఆధీనంలోనే గడిచింది! ఇప్పుడు తను స్వతంత్రురాలు! స్వతంత్ర జీవితంలో జీవితాన్ని గురించి ఆలోచించటం నేర్చుకుంది. తప్పునిసరిగా నేర్చుకుంది. మనిషి చుట్టూ విశాలమైన సమాజం వుంది! కొరుకుడు పడని పరిస్థితులన్నాయి! తనూ, తన ఉద్యోగం తనకు కొత్త! అంతవరకూ ఒకరు చెబితే వింటానికి అలవాటు పడ్డది. వివరేం చెప్పినా వినటమే తెలుసు! నోరు తెరిచి మాట్లాడవలసిన అవసరం కలగలేదు. కానీ, ఉద్యోగంలో చేరాక పరిస్థితి వేరు. అనేక సందర్భాల్లో సహచరుల దగ్గర తనూ తన అభిప్రాయాలు ప్రకటించవలసి వస్తోంది! నిద్రాణమైయున్న మనసు మేలుకున్నట్టుగా

# ఆరోజు రాకపోదు

అవ్యక్తమైన ఉత్సాహం కలిగేది! క్లాసులో పిల్లలతో కంఠశోష పడేవారు! వాహో! తనకూ వింత భోగా మాట్లాడటం చేతవును? తన మనసులో యిన్ని అభిప్రాయాలు నిద్రపోతున్నాయి కాబోలు! మాటల్ని వింత పొందికగా పేర్చగలుగుతుంది! అవి లిప్తపడిన క్షణాలున్నాయి! తన్ను తాను విరక్కుండానే మనిషి జీవితంగా నాలుగో పంతన్నా అర్థవుతుందనిపించింది! అదో అనివార్యమైన బాధ్యత్యం! చదువు సంధ్యలు నేర్చి, స్వతంత్రంగా బ్రతికే స్థితి వచ్చేవరకూ పెద్దలం భావాలకు దాసులుగా మెలగడమే వ్యక్తుల మనుగడకున్న ఏకైక లక్ష్యం అనుకుంది తను. తన మనుగడ లక్ష్యం మారింది! అప్పట్లో బ్రతికిన తన స్థితి వేరు! ఇప్పటి స్థితివేరు! ఎక్కడా పోలిక లేదు! అందుకే, అక్కయ్యతో తన వుద్దేశాన్ని నిర్భయంగా తెలిపింది! కనీసం రెండేళ్ళన్నా, స్వేచ్ఛగా బ్రతకనియ్యమని అర్థించింది! కాని ఏం ఏం ప్రయోజనం? 'కృతఘ్నత' అన్న పదం వాడనే వాడింది! అక్కయ్య వయస్సులో తనకంటే చాల పెద్దది! కన్నతల్లి కన్న మిన్నగా ప్రేమించి, పెద్ద జేసిన పుణ్యాత్మురాలు! తన జీవితానికి అర్థం ఏర్పడింది ఆమె సంకల్పం వల్లనే! బావ మనసు నొప్పించకుండ, బావ ఒక్కసారైనా విసుగు చెందటానికి అవకాశమివ్వకుండ, దాదాపు పదేళ్ళు తన్ను కడుపులో పెట్టుకుని కాపాడింది! అలాంటి అక్కయ్య తప్పెందుకు కఠినంగా శిక్షించాలనుకుంటుందో అర్థం కాలేదు. బావ తన పట్ల నిర్దయుడయినా ఉంటే సహజమని సరిపెట్టుకోగలదు తను. బావకు నచ్చ చెప్పవలసిన అక్కయ్య తప్పే నిందించింది. నాలుగువాళ్ళు సంపాదించటం చేతనయ్యే వరకే తన కళ్ళకు కావరమెక్కిందట! ముచ్చటపడుకోవటానికి తప్ప పనికి రాని తన బ్రతుకు నచ్చగిల్లి పొగరు పెంచుకుందట! తను అన్నీ సహించుకుంది! అక్కయ్య పైకి అనకపోయినా, మాటల్లో ప్రకటించిన తీవ్రమైన కసికి కారణాన్ని తను సులభంగానే వూహించగలిగింది! కళ్ళు చెమ్మగిలాయి! ఏ వూహ పైకి తన మనసుకు అన్నేళ్ళుగా దూరం జేసిందో, ఆ భయంకరమైన వూహకే అక్కయ్య వూపిరి పోసినప్పుడు తన గుండె పెట్టి పోయింది!

'ఏమమ్మా, అట్లా బిక్కుకొడుతుంటే తడుస్తూ కూర్చున్నావు. చలి వేయటం లేదూ?'

పక్కామె పలకరింపుతో తృళ్ళిపడ్డది సుశీల. పమిట చెంగుతో ముఖం తుడుచుకుని, తప్పని సరైనట్లు చిన్నగా నవ్వింది. కిటికీలన్నీ మూయటం వల్ల పెట్టెంతా దాదాపు చీకటిగా వుంది! తనొక్కతే వర్షాన్ని పట్టించుకోలేదన్నమాట! అన్నట్లు, వూరు విడిచి గంట కావస్తున్నా. వర్షం వెంటాడుతుండటం గమనించనే లేదు తను.

'ఏ వూరు పోవాలమ్మా?' పక్కామె ప్రశ్నించింది.

'అనుపాలెం! ఇంకెంత, అర్ధగంటలో దిగిపోతాను!' కిటికీ అద్దం వేస్తూ జవాబు చెప్పింది సుశీల.

'మీ పుట్టిల్లా?' పక్కామె వూరుకోలేదు.

'కాదు...'

'అత్తగారూరా?'

'కాదండీ...'

'మరేం పనిమీద పోతున్నావు?'

ఎందుకో ఆ ఆరాలన్నీ? అర్ధగంటలో దూరమైపోయే వ్యక్తిని గురించి ఏదో తెల్సుకోవాలని ఆమె ప్రయాస! లేనిపోని లంపట! చెప్పనందువల్ల ప్రయోజనం లేకపోయినా, ఆమె తృప్తికోసం అనుపాలెంలో ఉద్యోగం చేస్తున్నట్లు చెప్పింది సుశీల. అంతటితో తృప్తిపడి మరో పక్కకు తిరిగిందామె!

ముందు పరుగెత్తుతున్న రైల్లో సుశీల మనసు అంతకన్న వేగంగా వెనక్కి పయనించి సమాధి స్థితిని పొందింది, పెట్టెలో ఆవరించివున్న అదృశ్యమైన వాతావరణం లోనే!

తను పుట్టిన సంవత్సరానికి అమ్మ చనిపోయింది! అక్కయ్యకు అప్పటికి పన్నెండేళ్ళు! మగపిల్లలు లేరు. తమ కుటుంబానికి అక్కయ్యే ఆడదిక్కయింది! అక్కయ్య చదువు మాన్పించారు నాన్న. వయసుకు మించిన బాధ్యత అక్కయ్యమీద పడ్డది. ఇంటిపని, వంటపని, తన పోషణ అక్కయ్యకు అలవిమాలిన పనే! పైగా నాన్న దాన్ని ఆ విషయాల్లోనే అంతేరేట్లు జేశాడు! నాన్న గవర్నమెంటు ఉద్యోగి! ఒక్క ఆదివారాలు మినహాయిస్తే, మిగతారోజులన్నీ నాన్న హడావిడితోనే గడిచిపోయేవి! అక్కయ్య జీవితానికి అప్పటినుంచే ఒక క్రమం ఏర్పడింది.

మరి రెండేళ్ళకు అక్కయ్య రజస్వల కావటంతో నాన్న దిగులు పడ్డాడు. అక్కయ్య పెళ్ళి సమస్యయింది! ఎలాగో పెళ్ళిజేసి అక్కయ్య బరువు వదిలించుకున్నా తను నాన్నకు కొరకరాని సమస్య! మూడేళ్ళ పసిదాంతో ఆడదిక్కు లేకుండా వీలా నిర్వహించాలో నాన్న అనుభవానికి అర్థంకాలేదు! మూర్తీభవించిన అమాయకత్వం అక్కయ్యది! అరవ చాకిరీ చెయ్యటం తప్ప దానికి మరొక ప్రసక్తి తెలీదు! అప్పుడప్పుడు నాన్న తెలిసిన వాళ్ళతో అక్కయ్య పెళ్ళి విషయం సంప్రదిస్తుంటే, తలుపు చాటు నుండి విని, కంటతడి పెట్టుకునేది. పెళ్ళయితే, నాన్నను, తన్ను విడిచి భర్త దగ్గరకు వెళ్ళిపోవాలన్నది దానికి ఖచ్చితంగా తెలిసిన సత్యం! వద్దనే ధైర్యం మొదలే లేదు! పెళ్ళిని నిరాకరించటం మహాపరాధమని కూడ దాని వుద్దేశం! మొత్తానికి నాన్న అక్కయ్య పెళ్ళి ప్రయత్నం ముమ్మరంగానే చేశాడు! బెజవాడలో రైల్వే వుద్యోగం చేస్తున్న బావ దొరికాడు. పెళ్ళికొడుకు కుండవలసిన కనీస అర్హతలున్నాయి బావకు! బుద్ధిమంతుడు, అమ్మాయిల ముఖాల్లోకి కన్నెత్తి చూడలేని పిరికివాడు. కాఫీ ఇంట్లో తప్ప, అదీ రోజుకు రెండుసార్లే, హోటల్స్‌లో తాగని పొదుపరి! అన్నిటికీ మించి అక్కను మెచ్చినవాడు. వెయ్యి రూపాయలిస్తే చాలన్న ఉదారుడు. పెద్ద సమస్యనుకున్న అక్కయ్య పెళ్ళి సులభంగా సలక్షణంగా జరిగిపోయింది! అర్నెల్లన్నా గడువివ్వకుండా అక్కయ్యను వెంటబెట్టుకు పోయాడు బావ.

అక్కయ్య వెళ్ళిపోయాక ఒక సంవత్సరంపాటు నాన్న తనతో చాలా బాధలు పడ్డాడు. ఇల్లూడవటం, అంట్లు తోమటం తప్పితే అన్ని పనులూ నాన్నే చక్కబెట్టుకోవలసి వచ్చేది! సగం స్త్రీత్వాన్ని సంతరించుకున్నాడు! అక్కయ్య ఏటా దీపావళి పండక్కు మాత్రం వచ్చి నాలుగురోజులుండి వెళ్ళేది. అక్కయ్య వున్న నాలుగు రోజులూ

నిజంగా నాన్నకు పండగే అనిపించిందట! ఏడాదిగా పొందిన అలసటను తృప్తిగా తీర్చుకున్నాడు!

మొదట్లో ఎవరెంత నూరిపోసినా చెవి కెక్కించుకోని నాన్న, పరిస్థితులకు తట్టుకోలేక, మళ్ళీ పెళ్ళి జేసుకున్నాడు. పిన్ని అక్కయ్యకంటే ఐదారేళ్ళు పెద్ద! పిన్నివాళ్ళు నాన్న ఆగర్భ దరిద్రుడు! అమ్మాయి ఒక యింటిదైతే చాలనుకుని రెండో సంబంధానికిచ్చాడు! కట్న కానుకల బెడద లేదు. నాన్న వయస్సు కూడ నలభై లేవు! అక్కయ్య లాగే పిన్నికూడ మూడు నాలుగు తరగతులతోనే చదువు ముగించింది! విచిత్రమల్లా, నాన్న వివాహానికి అక్కయ్య బావ రాక పోవటమే!

కట్టుకున్న భర్త దృష్టిలో, ప్రత్యక్షంగా ప్రేమాదరాల్ని అనుభవించే తనలాంటి పసి మనస్సుల్లో ఏ స్త్రీకైనా మన్నన లభిస్తుంది! ఆ స్త్రీ తల్లిగానీ, సవతి తల్లిగానీ! కానీ లోకం-లోకం దాకా ఎందుకూ, ఇరుగు పొరుగు వాళ్ళ చాలు ఏడిపించి వీధిరమన్ను చెయ్యటానికి! తన కప్పట్లో ఏం తెలిసేది కాదు. చుట్టుపక్కల ఆడ వాళ్ళు పిన్ని దగ్గర కూర్చోబెట్టుకుని ఏవేవో చెబుతుండేవాళ్ళు! అన్నీ పిన్నిని గురించే! అనేకసార్లు వాళ్ళు తన చెంపలు నిమిరినట్లూ, కళ్ళల్లోకి జాలిగా చూసినట్లూ లీలగా గుర్తు! వాళ్ళ వ్యధేమిటో తన కర్థమయితేగా! బహుశః వాళ్ళే తనకు పిన్నిని 'పిన్ని' అని పిలవాలని బోధించివుంటారు.

సవతితల్లి నడిచే 'నరకం'లాంటి దేదీ చవిచూడకుండానే తనకు పదేళ్ళొచ్చాయి! వయసుతో పాటు వూహా పెరిగింది! పొరుగమ్మల మాటలకు టీకా తెలీకపోయినా, తాత్పర్యం గ్రహించగలిగేది! ఆ ఐదారేళ్ళ కాలంలో అక్కయ్య రెండుమూడుసార్లు మాత్రం వచ్చింది! ప్రతిసారీ వెళ్ళిపోయే ముందు తన్ను ఆమె గుండెల కదుముకుని కన్నీళ్ళు కార్చేది! కారణం తనకు అంతు బట్టలేదు.

తన చదువు విషయం కూడా ప్రస్తావించుకోవాలి మరి! నాన్న తన్ను నిర్లక్ష్యం చేశాడని కొందరి అభిప్రాయం! సవతితల్లి సవతిబిడ్డని బాగుపడనివ్వటం ఏకాలంలో వుందీ అని తన కళ్ళముందే మూతి విరిచిన వాళ్ళున్నారు. ఏమైనా, తను బడిముఖం చూడనిమాట నిజం! అంతమాత్రం చేత చదువు రాలేదని చెప్పటం సాధ్యంకాదు. ఎన్నో పలకలు పగలగొట్టింది! పుస్తకాలు చించింది! బలపాలను చిలిపిగా పిండి జేసింది! శతకాల్లో పద్యాలు ఎన్నో నోటికి వచ్చు! ఇరవై ఎక్కాలను అర్ధగంటలో అప్పజెప్పగలిగిన తన సామర్ధ్యాన్ని బడికి వెళుతుండే పొరుగుపిల్లలు మెచ్చుకోవటం బాగా జ్ఞాపకం. పిన్నికి తనపట్ల ప్రేమ వుందో లేదోగాని, చదువులో తన ఈడు వాళ్ళతో సమవుజ్జీగా వుండటానికి పిన్ని శ్రద్ధాసక్తులే కారణం!

సరిగ్గా ఓ ఏడాది గడిచేటప్పటికి మిన్ను విరిగి మీద పడినట్లైంది! తనకు కాదు! మొదట పొరుగమ్మలకు, కొంచం ఆలస్యంగా అక్కయ్యకు. పిన్నికి బాబు పుట్టాడు. తనెంత మురిసిపోయింది! ముద్దులు మూటకట్టే ముఖం, చాక్లెట్ లాంటి చిన్నముక్కూ, బుజ్జి చేతులూ ఎన్నిసార్లు స్పృశించినా తనివి తీరేదికాదు. వాడు నవ్వినా, కేర్‌మని చెవులు చిల్లులు పడేలా ఏడ్చినా ఒకేవిధమైన ఆనందం పొందేది తను! పుస్తకాలకంటే వాడే ప్రియమైపోయ్యాడు! పిన్ని అప్పుడప్పుడూ తన్ను మందలిస్తుండేది! చదువు మానేసి అస్తమానం బాబుతో కాలక్షేపంజేస్తే అక్కయ్యదగ్గరికి పంపేస్తానని బెదిరించింది కూడ! అయినా, తనేం భయపడ లేదు! బాబు నిద్రపోయే సమయాల్లో పుస్తకాలు ముందరేసుకునేది తను.

పిన్ని ఏ ఉద్దేశంతో అన్నదోగానీ, ఆ తర్వాత పిన్నిమాటే అక్షరాల యదార్థమైంది! ఓరోజు అనుకోకుండా వూడిపడ్డది అక్కయ్య. ఆఫీసుకువెళ్ళే తొందరలో వున్నాడు నాన్న. మామూలుగా యోగక్షేమాలు విచారించటమయింది! నాన్న కోటు తొడుక్కుంటున్నప్పుడు, ఆమె రాక కారణం చెప్పింది అక్కయ్య. నాన్న మ్రాన్పడిపోయాడు, ఎవరో గుండె కత్తిరించినట్లుగా పిన్ని విలవిల్లాడింది! సజల నేత్రాలతో తన కళ్ళలోకి అతిదీనంగా చూట్టం తన పసిమనసుకే రంపపుకోతయింది దంటే అతిశయోక్తి లేదు.

'నాన్నా! సుశీల ఇక యిక్కడవుండటం క్షేమంకాదు. అసలు దాని పుట్టుకలోనే మనం సవరించలేని లోపం ఏర్పడింది! కనీసం, దాని రెక్కలమీద అది బ్రతికే వీలైనా మనం కల్పించగలగాలి! ఇక్కడ అది సాధ్యపడదు! అందుకే నేను దాన్ని తీసుకుపోదామని వచ్చాను. మూడుగంటల బండికి వెళ్ళిపోతాం! మీరేం బాధపడొద్దు...'

ప్రతి పదాన్ని నొక్కి చెప్పింది అక్కయ్య! ఆమె నిర్ణయాన్ని అభినందించాలో, అభిశంసించాలో తెల్చుకోలేకపోయాడు నాన్న. పిన్నికి చేతనయింది, అచేతనంగా వుండి



పోవటమే. తన స్థితి అవ్యక్తం!

అక్కయ్యకు సమాధానం చెప్పకుండానే నాన్న ఆఫీసుకు వెళ్ళిపోయాడు. రెండు గంటలవరకూ ఇల్లు స్మశానంలా తయారైంది! వీళ్ళమధ్య మాటల్లేవు. అరాచకాన్ని సహించలేని శాంతిప్రియుడిలా బాబు కూడ మౌనముద్ర వహించాడు.

పావుగంటలో తన బట్టలన్నీ పెట్టెలో సర్దేసింది అక్కయ్య. మాటమాత్రంగా పిన్నితో చెప్పి రోడ్డుమీదికి వెళ్ళిపోయింది, 'రావే సుశీ' అని తన్ను హెచ్చరించి. ఏమిటో! గుండెల్లో దుఃఖం ఎగదట్టింది! క్షణం నిల్చుంటే కళ్ళు కాలవలైతవేమో నన్న భయం ఒకవంక! బాబునుమాత్రం గబుక్కున ముద్దుపెట్టుకుని, కుంటినడకతోనే వెళ్ళి అక్కయ్యను కలుసుకుంది తను.

అక్కయ్యకి బావకి తనో దురదృష్టవంతురాలని నమ్మకం. కానీ, ఏదో ఆశ వాళ్ళిద్దరినీ పీడిస్తుండేది. తన జీవితానికి ఓ పరమార్థం ఏర్పడితీరాలని సంకల్పం! వాళ్ల దురాశకు తను నవ్వుకునేది నిర్లిప్తంగా! అయినా, వాళ్ల ప్రయత్నానికి సహకరించకపోతే ద్రోహం జేసినట్లవుతుందని అహోరాత్రాలు కృషిజేసింది. ఇద్దరు ట్యూషన్ మేష్టర్లు! ఒకాయన ఉదయం వచ్చి మెట్రిక్యులేషన్ పుస్తకాలు నూరిపోసి పోతుండేవాడు. సాయంత్రం మేష్టరు హిందీకి ప్రత్యేకం! మొత్తం పదేళ్ల ప్రణాళిక! ప్రణాళిక విజయవంతమైతే అక్కయ్య కోరిక నెరవేరుతుంది! తనూ ఏ హిందీ పండిట్ వుద్యోగంలోనో పొట్ట బోసుకుంటుంది!

ప్రణాళికలో ప్రథమార్థం పూర్తయ్యేసరికి మెట్రిక్యులేషన్ పాసవటంతో పాటు, మరికొన్ని హిందీ పరీక్షల్లో కూడ నెగ్గింది తను. బెజవాడ టౌను కావటంవల్లా, తదితర పుస్తకాలు చదవటంవల్ల కొద్దో గొప్పో ప్రపంచజ్ఞానమూ అమిరి వుండొచ్చు! లేకపోతే తన మనసులో కొత్త ఆలోచనలు రేకెత్తటానికి ఆస్కారంలేదు. ఆ ఆలోచన్లు సాధారణమైనవికావు, కృంగదీసేవి!

మొదటిదీ, ముఖ్యమైందీ దేవుడు తన్ను అన్యాయం జేశాడన్నది. అంతవరదాకా తన కాలు కుంటిదని దిగులు పడిన క్షణం లేదు. పిన్ని దగ్గరున్నప్పుడు [illegible]



పూట బయట అరుగుమీద కూర్చునీ, పిల్లలు పరుగు పందేలు తీస్తుంటే సంతోషంతో చప్పట్లు చరుస్తుండేది! పిల్లలూ తనపట్ల ప్రేమగా వుండేవాళ్లు. కానీ, యీడు ముదిరాక ఆలోచనారీతి మారిపోయింది!

కొరుక్కు తింటానికి పనికొచ్చే అందచందాలున్నయి! పరీక్షలు పాసు కావటానికి వలసిన తెలివితేటలకు కొరత లేదు! మరో ఐదేళ్లు కష్టపడితే వుద్యోగార్హత కూడ వస్తుంది. అంతేనా జీవితం? అలా ఒంటరి జీవితాన్ని జీవితాంతం గడపటం సాధ్యమా? అనుభవించటానికి అక్కరకు రాని లావణ్యం ప్రసాదించాడు దేవుడు అంగవైకల్యాన్ని తోడుజేసి. తన్నెవరు కోరి వివాహం జేసుకుంటారు? పురుషుడి సాహసానికి, తెగింపుకీ అగ్నిపరీక్షగా నిలిచే అంగవైకల్యం!

ఆలోచనలను అదుపులో వుంచుకుంటూ హిందీ పరీక్షలన్నీ పాసుకావటం, హిందీ పండిట్ ట్రైనింగ్ కూడ పూర్తి చేయటం తర్వాత ఐదేళ్ళలో తను సాధించిన ఘనవిజయాలు. అవ్యక్తమైన గర్వం పొడసూపింది తనలో! తనూ వుద్యోగస్థురాలవుతుంది. పరాశ్రయంలో బ్రతకాల్సిన దుస్థితి వుండదు. వస్తుతః కుంటివాళ్ళంటే ఎవరైనా జాలిపడతారు. ఎవ్వరూ గేలి చేయరు! హేళన చేయరు. కనీసం ఆర్థికంగానైనా స్వతంత్రం లభిస్తుంది. ఆపాటి జీవితమైనా ఎంతమంది స్త్రీలకు లభ్యమవుతోంది?

బావ విశేష ప్రయత్నం వల్ల జిల్లా పరిషత్ స్కూల్లో హిందీ పండిట్‌గా నియమింపబడ్డది తను. అదే సమయంలో బావకు చిత్రంగా ట్రాన్స్‌ఫర్ అయింది బెజవాడ నుంచి మంగళగిరికి! అక్కడికి దాదాపు యాభైమైళ్ళ దూరంలో వున్న అనుపాలెంలో తన వుద్యోగం! పరాయిచోట ఒంటరిగా బ్రతకాలి అన్న లేశమాత్రమైన భావన తన కళ్లలో మేఘాలు సృష్టించింది! కానీ వెళ్ళి తీరాలి! బ్రతుకు తెరువుకోసం పొరుగూరే కాదు, ఖండాంతరమైనా వెళ్ళక తప్పదు! అందులోను తన లాంటి దైవోపహతులకు అన్నీ కోరుకున్నట్లు జరుగుతాయా? జరగాలని ఆశించటం పెద్ద నేరమవుతుంది!

ఉద్యోగంలో చేరింది! కొత్త ప్రదేశంలో మనుషులు కొత్త అనిపించినా. వాళ్ళ ఆదరాభిమానాల్లో, నడతలో వింత గోచరించలేదు. తనమాటే వాళ్లని ఆకట్టుకుందో, రూపురేఖలు ఆకర్షించాయో; తన అంగవైకల్యమే వాళ్లల్లో వాత్సల్యాన్ని ప్రవహింపజేసిందో చెప్పలేదు. మొత్తానికి జీవితం తృప్తికరంగా సాగిపోతోంది!

చేరిన మూణ్ణెల్లకీ దసరా శలవలొచ్చాయి! మనసంతా బాబు ఆక్రమించాడు. ఆనాటి పిన్ని విషాదస్వరూపం కళ్ల ముందు ద్యోతకమయింది! నాన్న ఎలా వున్నాడో? బాబు పదేళ్లవాడయి వుంటాడు!

బాబుదగ్గరికి వెళ్లాలన్న బలీయమైన కోరిక, వింతయెత్తుగా లేచినా విరిగిపడే కెరటంలా, అక్కయ్య జ్ఞాపకంతో మనసులోనే నొరిగిపోయింది! ఉద్యోగంలో చేరాక మొదటిసారిగా వచ్చిన శలవలు! అక్కయ్యను చూడ్డమే ధర్మం!

తనెంతో మారిపోయిందనీ, ఇదివరకులేని హుందాతనం శరీరంలోని ప్రతి అంగుళంలోనూ వెల్లివిరుస్తుందనీ అక్కయ్య పొగడలేక తబ్బిబ్బైంది! కానీ, సిగ్గు ముంచుకురావటానికి కారణం బావ మెచ్చుకోలు! తనూ మనిషి, అందునా స్త్రీ, సహజంగానే తెగమురిసిపోయింది!

ఆ రాత్రి...

సమయం పదిగంటలు! ఎంతకీ నిద్ర రాలేదు. తన వ్యర్థసౌందర్యం గురించే తపన చెందుతోంది మనసు. చివరకు తను చేసుకున్న నిర్ణయం; పురుషుణ్ణి గురించి కలలోకూడ తలచకూడదని! అదే తన జీవయాత్రకు వునులు బాటనుకుంది!

ఆ సమయానికే పక్కగదిలోంచి అక్కయ్య బావల మాటలు వినిపించి, చెవులప్పగించిందటే!

'మీ మేనల్లుడు సుందరం మరీ పోకిరిగా తయారైనా డంటున్నారుగా! అతన్నొక మార్గంలో పెట్టాలంటే నేనో వుపాయం చెబుతాను...' అంది అక్కయ్య.

'ఏమిటో అది?' బావ నవ్వాడు.

'సుశీలను ముడిపెడితే దాని బ్రతుకూ పరిపూర్ణమవుతుంది! దాన్ని అంటిపెట్టుకుని [illegible]కైనా మనిషవుతాడతను. ఏమం

టారు?'

'బంగారంలాంటి పిల్లడు...'

'అబ్బబ్బ! అది బంగారమేనండీ! అందుకే, దానికీ జీవితసుఖం అబ్బాలని నా ఆరాటం! ఎంత బంగారమైనా కుంటి దాన్ని పావలదిచ్చి ఎవరు చేసుకుంటారు?'

'అదీ నిజమే!'

'కాబట్టి వాళ్లిద్దరికీ వివాహం చేద్దాం! సుశీల ఎంతో సంతోషిస్తుంది. పెట్టి పోషించలేకపోయినా, సుందరాన్ని పువ్వుల్లో పెట్టి పూజిస్తుంది. దాని సంగతి నాకు తెలుసు.'

'సరే! నీకు లేని అభ్యంతరం నాకేమిటి? సుశీల నడిగి తెలుసుకో...'

'సుందరాన్ని ఒప్పించే బాధ్యత మీది.'

'రేపే ఉత్తరం రాసి రప్పిస్తా!'

'పొద్దున్నే సుశీలతో చెప్పేస్తా నేను. అది మటుకు కాదంటుందేమిటి?'

'కాదంటే నువ్వూరుకుంటావా?'

'పిన్ని దగ్గరే ఇప్పటివాకా వున్నట్లయితే ఇంటెడు చాకిరీచేస్తూ పనిమనిషిలా బతుకుతుండేది! నాన్నమీద కసికొద్దీ, సుశీలను తీసుకొచ్చి ఇంతదాన్ని చేశాను. ఈ పెళ్ళి కూడ జరిపించావంటే నలుగురూ వాళ్లిద్దరినీ దుయ్యబట్టటం తథ్యం!'

'ఘనమేలే! ఇక లైటార్పి పడుకో...'

'ఈ ఘనత మీకూ దక్కుతుందిలే!'

అంతటితో వాళ్ల మాటలు ఆగిపోయినయి! నవ్వాలో, ఏడవాలో అర్థంకాలేదు తనకు. వివాహాన్ని గురించిన వూహ మధురంగా వుండాలి! జీవితంమీద వెగటు కలిగించి. వివాహపు కోరికనే సమూలంగా రూపుమాపే ప్రతిపాదన విన్నప్పుడు ఆశ్రయించవలసింది కన్నీళ్లనే! తెల్లవారుతుంది! అక్కయ్య తన్ను నిలదీసి అడుగుతుంది! ఏదో సమాధానం చెప్పాలి! అహం! ఏదో చెబితే సరిపోదు! ఆమెకు తృప్తికరంగ వుండాలి! విద్యాబుద్ధులు నేర్పించి, ప్రయోజకురాలుగా జేసినందుకు అమె ఆశించే 'కృతజ్ఞత'కు ఏమాత్రం విరుద్ధంగా వుండకూడదు! తనకు పరీక్షా సమయం!

సుందరం! అప్పటికి నాలుగైదుసార్లు స్కూలుఫైనల్ పరీక్ష తప్పి, ఇంటికి పెద్దవాడుగా తల్లిదండ్రుల చేతి కందిరాక, జులాయిగా తిరుగుతున్న మగవాడు! బావ మేనల్లుడు! బావ భాషలోనే 'పోకిరీవాడు.' అతనికి తన్ను ముడేస్తానంటది అక్కయ్య! తనేం మగవాడి తోడుకోసం తపించిపోవటం లేదే! తహతహలాడటం లేదే! వ్యక్తిగా తన అర్హతలన్నీ, అంగవైకల్యం ముందు తృణప్రాయమన్నమాట! అక్కయ్య ఎంత సంకుచితంగా ఆలోచించింది! ! ఆనాడు నాన్న విషయంలోనూ అంతే! పునర్వివాహం చేసుకున్నందుకు ఆయన వాత్సల్యాన్ని శంకించింది; సవతితల్లి అన్న నెపంతో పిన్నిని ద్వేషించింది! తన్ను ఆదరించటంలో అక్కయ్య ఆంతర్యం, వాళ్లిద్దరినీ అపఖ్యాతిపాలు చేయటమే! నిజంగా తన దౌర్భాగ్యం కాకపోతే అక్కయ్యను గురించి జుగుప్సాకరమైన ఆలోచన రావటమేమిటి? బుద్ధి వికసించటం, వివేకజ్ఞానం విస్తరించటంకూడ మనిషికి ప్రమాదకమేనేమో! రాత్రంతా కంతలోనే కరిగిపోయింది!

సుర్యోదయం! కాఫీ చేతికందిస్తూ 'సుశీ' అంటూ నవ్వింది అక్కయ్య. ప్రతిగా నవ్వటం తనవల్ల కాలేదు.

'సుందరంతో నీ వివాహం సెటిల్ చేద్దామనుకుంటున్నా! బావకూడా 'యస్' అన్నాడు. నీ వుద్దేశం చెప్పు...'

ఇరేకానయం! సెటిల్ చేసే శాశ అన్నాడు! బావ 'ఎస్' అనటం తన అదృష్టం కాబోలు!

'నాకు యిష్టంలేదక్కయ్యా! సుందరం కాదు—పెళ్లి...' తప్పించుకునే ప్రయత్నం చేసింది తను.

'ఏదేమిటే పిచ్చిదానా, పెళ్లి యిష్టం లేకపోవటమేమిటి?'


'కుంటి బ్రతుక్కి అదో క్కటి తక్కువా?'

'సుశీ!'

'ఔనక్కయ్యా! ప్రశాంత సాగరం లాంటిది నా ప్రస్తుత జీవితం. తొందరపడితే పెనుతుఫాను పుట్టిందని పెళ్లిని నిందించుకోవల్సి వస్తుంది! కన్నులోమంట కాటుకెందుకు?'

'ఇంత డొంకతిరుగుడెందుకే, సుందరం యిష్టంలేదని ఒక్కమాటతో నా నోరు తియ్యరాదూ?'

అంతలోనే ఆవేశం! కళ్లల్లో మంటలు! ఒకళ్లపట్ల చెను తలంపుతో మరొకరికి మంచి చేసి, ఆ మంచిని పెంచుకుందామనే తాపత్రయంలో చెడుని వూహించలేని అయోమయస్థితిలో వుంది అక్కయ్య. అంతకంటే



పిమ్మలంగా ఇలా మాట్లాడుతుందా? తమా ఆవేశపడితే అనవసరపు రభస!

'అక్కయ్యా! ఇందులో నీ పరువు పొయ్యేదేముంది చెప్పు! పెళ్ళిపట్ల నాకు ఆసక్తి లేదు! దయచేసి నన్ను అపార్థం చేసుకోవద్దు...' అంది వినయంగా తను, కుంటికాలివంక చూస్తూ.

అప్పుడే వరసగా, 'కృతఘ్నత', 'పళ్ళు పొగరు', 'కళ్ళకావరం'లాంటి కఠిన పద జాలాన్ని ప్రయోగించింది అక్కయ్య.

## ఆరోజు రాకపోదు

వారంరోజుల సెలవులు గడ్డగానే గడిచాయి! సుందరం రాలేదు! బహుశః బావ పుత్తరం రాయలేదేమో అనుకుంది తను. సెలవలు పూర్తయి బయల్దేరేటప్పుడు అక్కయ్య గావించిన ఉపదేశం, వెళ్ళిన వెంటనే ఉత్తరం రాయమని! ఆమె సంతోషంకోసం కాదు. బావను సంతోష పెట్టటానికి! అంటే, అయన తన ఉన్నతికోసం త్యాగంజేసిన డబ్బుకు కృతజ్ఞతా సూచకమైన జాబు!

'టీచర్రోయ్, టీచరు! హిందీ టీచ రొచ్చింది...' ఇద్దరు ముగ్గురు పిల్లలు అరుచుకుంటూ ప్లాట్‌ఫారంమీద దూకు లాడుతుండటంతో, త్రుళ్ళిపడి కిందికి దిగింది సుశీల!

'నమస్తే టీచర్, నమస్తే టీచర్...' అనుకుంటూ పిల్లలు సుశీల దగ్గరికి చేరారు.

ఒకడు చేతిలో పెట్టె లాక్కున్నాడు. మరొకడు బుట్ట గుంజుకున్నాడు. ఏదీ దొరకని మూడోవాడు టీచర్ చేతిలోని పర్సువంక కుతూహలంగా చూశాడు. అది వాడి చేతిలో పెట్టి ముందుకు సాగింది సుశీల.

* * *

సాయంత్రం ఆరుగంటలు! ఇంటి ముందు ఖాళీ ప్రదేశంలో మంచం వాల్చుకు కూర్చుంది. అప్పుడప్పుడు వీస్తున్నగాలికి, వేపకొమ్మలు వీరసంగా కదులుతున్నాయి! ఇంకా వెలుగు మూత పడలేదు.

ప్రియమైన అక్కయ్యకు చెల్లెలు నమస్కరించి వ్రాయునది! మూడుగంట లకు ఇక్కడికి క్షేమంగా చేరుకున్నాను. రేపటినుంచి స్కూలు! ఆ వాతావరణంలో ఇమిడిపోతే ఉత్తరం వ్రాయటానికి ఆలశ్య మవుతుందన్న భయంతో ఈరోజు సాయం త్రమే ఆ పని పూర్తిచేస్తున్నాను. నాకు వివాహకాంక్ష లేదని చెప్పలేను కాని, అందని పండుకు అర్రులు చాచటం మూర్ఖత్వం కదూ! అసలా ప్రయత్నమే విరమించుకుంటే అదో రకమైన తృప్తి! ఏదో అండకోసం అంగలారిస్తే జీవితం చీడపురుగు నాశ్రయించే చిగురుటాకు చంద మవుతుంది. అంతకన్న ఇది మేలైనపని! పోనీ, ఎప్పటికైనా వివాహేచ్ఛ ప్రబల మైతే కన్నెలందరిలాగే, నన్ను కోరుకున్న వాడినే చేసుకుంటా. 'ఆరోజు రాకపోదు' అన్న ఆశతో జీవిస్తా! ఇంకేం వ్రాయను? సెలవ్,

నీ చెల్లి,

సుశీల.

6—7—78


# భారతీయ చిత్రకారులు

రచన, చిత్రాలు: కాళిపు సోమరాజు

## పిరాజీ సాగరా

శ్రీ పిరాజీ రాజస్థాన్‌లో 1931లో జన్మించేరు. కాని అహమ్మదాబాద్‌లో స్థిరనివాస మున్నారు. అందుచేత ఈ రెండు ప్రాంతాల ప్రభావం వీరి చిత్రాల మీద కనిపిస్తుంది. అహమ్మదాబాద్‌లోను, బొంబాయి జె. జె. లోను చిత్ర కళాభ్యాసం చేసేరు.

మొదట్లో వీరు పెయింటింగ్ చేసేవారు. కాని ఆతర్వాత కొలాజ్ శైలిని స్వీకరించేరు. కొలాజ్ శైలిలో వీరి చిత్రాల్ని సులువుగా గుర్తించవచ్చును. వీరు కర్ర, గాజుపూసలు, లోహము, ప్రింటింగ్ బ్లాక్సు ఉపయోగిస్తారు.



వీరికి తమకు రంగులు ఇష్టం. వర్తులాలు, అర్ధవృత్తాలు, సర్పాకృతులపై పూసలు అమర్చబడి తాంత్రిక ఆకృతుల్ని సంతరించుకొని ఉంటాయి వీరి చిత్రాలు.

1963లో అహమ్మదాబాద్‌లో వీరి చిత్రాలు మొదట ప్రదర్శింపబడ్డాయి. తర్వాత ఢిల్లీ, బొంబాయిలలో నాలుగుసార్లు ప్రదర్శితమయ్యాయి. అంతర్జాతీయ ప్రదర్శనాలలో వీరి చిత్రాలున్నాయి. 1963లో లలితకళా అకాడమీ వారు, గుజరాతు, బెంగాల్ ప్రభుత్వాలు వీరికి చాలా బహుమతులిచ్చి సన్మానించేరు.